క్లుప్తంగా

వాహనాలు తనిఖీ



మైనర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మామడ: మండలకేంద్రంలో శనివారం ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. బైక్‌లు నడుతూ పట్టుబడిన మైనర్లకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలని పేర్కొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సారంగాపూర్: మండలంలోని ధని గ్రామంలో తెలంగాణ గ్రామీణబ్యాంకు జామ్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను వివరించారు. సూర్యఘర్, రాజీవ్ యువవికాసం పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మేనేజరు రాజేశ్వర్ సూచించారు. సైబర్ మోసాల బారిన పడితే ఆందోళన చెందకుండా 1930కి ఫోన్ చేసి చెప్పాలన్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థం



జరిమానా విధిస్తున్న సిబ్బంది

నిర్మల్‌టౌన్: ప్లాస్టిక్ వస్తువుల వినియోగంతో ఆరోగ్యానికి అనర్థమని.. ప్రజలు బట్ట సంచులు వాడి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పలు దుకాణాల్లో మున్సిపల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగిస్తున్న షాపులకు రూ.5,500 జరిమానా విధించారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే దుష్పరిణామాలను వివరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది ఉన్నారు.

ఆత్మ డైరెక్టర్‌గా లింగన్న



లింగన్నను సన్మానిస్తున్న నాయకులు

సోన్: మండలకేంద్రానికి చెందిన రిటైర్డ్ టీచర్, కాంగ్రెస్ నాయకులు ఆత్మ డైరెక్టర్‌గా లింగన్న శనివారం నియమితులయ్యారు. దీంతో ఆయనను సోన్‌లో కాంగ్రెస్ నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకంతో డైరెక్టర్ పదవి అప్పగించినందుకు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో ప్రసాద్, అజార్, నర్సారెడ్డి, సాయి తదితరులు ఉన్నారు.

బీజేపీ మండల కార్యవర్గం

సారంగాపూర్: బీజేపీ మండల కార్యవర్గాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ ఆధ్వర్యంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ మండల ఉపాధ్యక్షులుగా డోకూర్ భీమలింగం, కొప్పుల నర్సయ్య, ఈర్ల విజయ్, తిరుమలచారి, మండల ప్రధాన కార్యదర్శులుగా ఇప్ప శ్రీకాంత్‌రెడ్డి, రాథోడ్ నారాయణ, కార్యదర్శులుగా గణేశ్, నాగుల రతన్‌రెడ్డి, సుంకరి శ్రీకాంత్, శ్రీ ని వా స్, కోశాధికారిగా వలమల నవీన్‌తో పాటు 40మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి మండలాధ్యక్షుడు కాల్వ నరేశ్ శుభాకాంక్షలు తెలిపారు.

సోన్ మండల కార్యవర్గం..

సోన్: బీజేపీ మండల కార్యవర్గాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సోన్ మండలాధ్యక్షుడు మార గంగారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యవర్గానికి సూచించారు. మండల ఉపాధ్యక్షులుగా పెసరి గణేశ్, బోనగిరి గంగయ్య, మద్దెల గంగాధర్, ఎలుగు విజయ, ప్రధాన కార్యదర్శులుగా సుంచు సవీన్, మామిడాల సంతోష్, కార్యదర్శులుగా మేకల మల్లేశ్, జక్కు ప్రశాంత్, బద్ధం గంగారెడ్డి, అటాక్ శైలజ, ట్రెజరీగా కొటూరి లావణ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.


దుప్పిని కాపాడిన స్థానికులు

ఖానాపూర్: జనావాసాల్లోకి వచ్చిన దుప్పిని కుక్కలు తరమడంతో స్థానికులు కాపాడి అటవీ అధికారులకు అప్పగించిన ఘటన ఖానాపూర్‌లో చోటు చేసుకొంది. శనివారం పట్టణంలోని సాయిబాబా ఆలయం వెనకభాగం అటవీ ప్రాంతం నుంచి రెంకోని వాగులో నీరు తాగేందుకు వచ్చింది. ఊరకుక్కలు వెంటపడి గాయపరిచాయి. గమనించిన దిలావర్‌పూర్ వాసి బీపీఎం రాచమల్ల శ్రీనివాస్‌తో పాటు ఆర్.అశోక్, భూక్య గోవింద్ నాయక్ కుక్కలను తరిమికొట్టి అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్‌బీవో నరేందర్, సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని దుప్పిని అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు.



రోడ్డుపై సంతతో తిప్పలు

కుంటాల: మండలంలోని కల్లూరులో ప్రతి శనివారం మేకల సంత నిర్వహిస్తారు. జాతీయ రహదారిపైనే వ్యాపారులు క్రయవిక్రయాలు జరుపుతుండటంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. వారసంతను మరోచోటకు తరలించి.. రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ..

నర్సాపూర్(జి): మండలంలోని నందన్ గ్రామానికి వెళ్లే దారిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో మూగజీవాలు విద్యుత్ షాక్‌తో మృతి చెందుతున్నాయి. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.



చెరువు మట్టి.. చేనుకు బలం.!

కుంటాల: చెరువు పూడికమట్టి చేనులో పోసుకుంటే మంచి దిగుబడులు వస్తాయని వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో మండలంలోని ఓలా, అందాకూర్, వెంకూర్, పెంచికల్‌పాడ్ గ్రామాల రైతులు నీటిపారుదలశాఖ అనుమతితో చెరువు పూడికమట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలించుకొని తమ వ్యవసాయ భూముల్లో చల్లుకుంటున్నారు.

సృజనాత్మకతకు పదును

- భైంసా కేజీబీవీలో సమ్మర్‌క్యాంప్
- సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థినులు

సమ్మర్ స్పెషల్



స్పోకెన్ ఇంగ్లిష్ పాఠం చెబుతున్న శిక్షకురాలు



తాము గీసిన చిత్రాలు చూపుతున్న విద్యార్థినులు

భైంసాటౌన్: ఆధునిక పోటీ ప్రపంచంలో మార్కులు, ర్యాంకులే విద్యార్థుల ప్రతిభకు కొలమానంగా మారాయి. వారి ఆసక్తులను పట్టించుకోవడం లేదు. కానీ కస్తూర్బా పాఠశాలల విద్యార్థినుల్లో సృజనాత్మకత పెంచే లక్ష్యంతో ఈసారి సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేశారు. జిల్లాలోని 18 కేజీబీవీ (కస్తూర్బా బాలికల విద్యాలయం)ల్లో చదివే వంద మంది విద్యార్థినులకు పలు అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. ఈనెల 5 నుంచి శిబిరం ప్రారంభం కాగా.. 20 వరకు సాగనుంది. శిబిరంలో విద్యార్థినులకు ఫైన్ ఆర్ట్స్(మ్యూజిక్, డ్యాన్స్, పెయింటింగ్ సాధన), కంప్యూటర్ స్కిల్స్, బేసిక్ కోడింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, స్పీడ్ మ్యాథ్స్, యోగా, వాలీబాల్ తదితర అంశాల్లో శిక్షకులతో తర్ఫీదునిస్తున్నారు. విద్యార్థినులు సైతం ఉత్సాహంగా పాల్గొంటూ శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నారు.

చిత్రలేఖనంలో భళా..

విద్యార్థినుల్లో సృజనాత్మకతకు పదునుపెట్టేలా చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తున్నారు. దీంతో వారు అందమైన, ఆకర్షణీయమైన పెయింటింగ్‌లు వేస్తున్నారు. ప్రకృతి రమణీయత, పల్లెటూరి అందాలు, ఇలా చూడగానే ముచ్చటగొలిపే చిత్రాలు గీయడం నేర్చుకుంటున్నారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో పెయింటింగ్‌పై ఆసక్తి పెరిగిందని పలువురు విద్యార్థినులు పేర్కొంటున్నారు.



సంగీతంలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

నృత్యం, సంగీతంలో శిక్షణ...

ఈ క్యాంప్‌లో విద్యార్థినులకు నృత్యం, గానంలో శిక్షణ అందిస్తున్నారు. కూచిపూడి, భరతనాట్యం వంటి సంప్రదాయ నృత్య రీతులతోపాటు సంగీతం కూడా నేర్పిస్తుండడంతో వారు ఎంతో శ్రద్ధగా నేర్చుకుంటున్నారు.

ఇంకా మరెన్నో...

ఇవే కాకుండా, ప్రతిరోజు యోగాసనాలు, వాలీబాల్, ఇతర క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. కంప్యూటర్ పరిజ్ఞానంతోపాటు, బేసిక్ కోడింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, స్పీడ్ మ్యాథ్స్, ఇతర అంశాల్లో తర్ఫీదు ఇస్తున్నారు.

ఆసక్తిగా నేర్చుకుంటున్నారు..

విద్యార్థినులకు 20రోజులపాటు సమ్మర్ క్యాంప్ కొనసాగుతుంది. ఇందులో భాగంగా పలు అంశాల్లో శిక్షకులతో తర్ఫీదు ఇస్తున్నాం. విద్యార్థినులు కూడా ఆసక్తితో నేర్చుకుంటున్నారు. విద్యార్థినులు నైపుణ్యాలు నేర్చుకునేందుకు ఈ శిబిరం ఉపయోగపడుతుంది.

– జ్యోతి, ఎస్‌వో, కేజీబీవీ, భైంసా

‘డబుల్’ ఇల్లు ఇవ్వాలని వినతి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న రాజు, మహిళలు

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నర్సాపూర్(జి)లో పేద కుటుంబాల మహిళలతో ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో డీటీ వాహీదొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించినా.. పంపిణీ చేయలేదన్నారు. పక్షపాతం లేకుండా అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. సమస్య పరిష్కరించకుంటే కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎం.హరిత, మహిళలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి



రైతులతో మాట్లాడుతున్న డీఎం సుధాకర్

నర్సాపూర్(జి): ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని సివిల్ సప్లై డీఎం సుధాకర్ సూచించారు. మండలకేంద్రంలోని ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూస్తామని పేర్కొన్నారు.

అకాల వర్షంతో ఇబ్బందులు

దస్తురాబాద్: మండలంలోని భూత్కూర్, గొడిసేర్యాల, రేవోజీపేట, బుట్టాపూర్, దస్తురాబాద్, ఆకొండపేట గ్రామాల్లో శనివారం మోస్తారు వర్షం కురవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం కుప్పలు ఉన్నాయి. తూకం వేసేందుకు, తూకం వేసిన ధాన్యాన్ని లారీల్లో నింపేందుకు హమాలీలు లేకపోవడంతో జాప్యం నెలకొంటుంది. రోజు వర్షం కురుస్తుండటంతో కొనుగోలు కేంద్రాల వద్దే కాపలా ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్లు

కుంటాల: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు మబ్బులు కమ్ముకోవడంతో రైతులు ఆందోళన చెందారు. కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న జొన్నలు తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పి ఉంచారు.

నల్లా కనెక్షన్లకు మోటార్లు బిగించొద్దు



మోటారు కనెక్షన్లను పరిశీలిస్తున్న మిషన్ భగీరథ ఈఈ సందీప్, అధికారులు

లోకేశ్వరం: ప్రభుత్వం ఇంటింటికీ సరఫరా చేసే మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లకు విద్యుత్ మోటార్లు బిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మిషన్ భగీరథ ఈఈ సందీప్ అన్నారు. మండలంలోని గడ్చాంద గ్రామంలోని 13వ వార్డు ప్రజలు తమకు నీరు రావడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు శనివారం గడ్చాంద గ్రామానికి వచ్చి భగీరథ నీటి కనెక్షన్లకు పరిశీలించారు. పలు అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించారు. 13వ వార్డులో ఇంటింటికి తాగునీరు వచ్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎంపీడీవో వెంకటరమేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయిప్రసాద్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డుకు రూ.65లక్షలు మంజూరు



ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్

భైంసాటౌన్: పట్టణంలోని గణేశ్‌నగర్ సమీపంలో సుద్దవాగు మహాదేవ్ ఆలయానికి వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.65లక్షల నిధులు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ అన్నారు. ఈమేరకు శనివారం పట్టణంలోని తన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు ప్రొసీడింగ్ కాపీ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండడంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర్‌చంద్రే, ముత్యంరెడ్డి, రాంచందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో భూగర్భజలాలు పెంపు

- కందకాలు, చేపల చెరువుల నిర్మాణం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న ఈజీఎస్ సిబ్బంది



మామడలో కందకాలు తవ్వుతున్న కూలీలు



పొన్కల్ చెరువులో చేపల కోసం తవ్విన కుంట

మామడ: ఉపాధిహామీ పథకం కింద మండలంలో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈసారి గ్రామీణ ప్రజలకు పనులు కల్పించడంతోపాటు భూగర్భజలాల పెంపుపై దృష్టి సారించారు. గతంలో మొక్కలు నాటడం, పంట చేన్లకు వెళ్లేందుకు మట్టిరోడ్లు నిర్మించడం వంటి పనులు చేసేవారు. తాజాగా భూగర్భ జలాలను పెంచడం, చెరువుల్లో చేపల పెంపకాన్ని సులభతరం చేయడం లక్ష్యంగా కందకాలు, చిన్న చేపల కుంటల నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనులతో వర్షం, వరద నీటిని భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పెంపొందించే చర్యలు చేపట్టారు.

గ్రామీణ ఆర్థిక, పర్యావరణ ప్రయోజనాలు

మామడ మండలంలో 3,545 జాబ్ కార్డు కలిగిన కుటుంబాల నుంచి 5,446 మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. రోజువారీ కూలీగా రూ.235 చెల్లిస్తున్నారు. 27 గ్రామపంచాయతీల్లో కందకాలు, ఫామ్పాండ్స్, ఫిష్ పాండ్స్ నిర్మాణం జరుగుతోంది. ఈ పనులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు, నీటి సంరక్షణకు దోహదపడుతున్నాయి. గుట్టప్రాంతంలో కందకాలు తవ్వడం ద్వారా చెట్లు పెరిగి పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడుతున్నాయి.

వర్షపునీరు వృథా కాకుండా..

మామడ మండలంలోని పొన్కల్, పోతారం, దిమ్మదుర్తి, నల్దుర్తి, మామడ, బండలఖానాపూర్ వంటి గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతాల్లో వర్షపు నీరు వృథా కాకుండా భూమిలో ఇంకేలా కందకాలు తవ్విస్తున్నారు. 3 మీటర్ల పొడవు, 1 మీటరు వెడల్పు, 1 మీటరు లోతుతో నిర్మిస్తున్న ఈ కందకాలు మట్టి కోతను నివారిస్తూ, భూగర్భజలాలను పెంచుతున్నాయి. వరద ఎక్కువగా ఉన్న ఒర్రెల వద్ద మట్టికట్టలు నిర్మిస్తున్నారు.ఇవి నీటి సంరక్షణకు దోహదపడుతున్నాయి.

చెరువుల అభివృద్ధి..

మండలంలోని ఏడు చెరువుల్లో 25 మీటర్ల పొడవు, 15 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతుతో ఫిష్ పాండ్స్ నిర్మిస్తున్నారు. ఈ చిన్న కుంటలు చెరువు ఆక్రమణలను నివారిస్తూ, చేపల పెంపకాన్ని సులభతరం చేస్తున్నాయి. ఈ నిర్మాణాలు భూగర్భ జలస్థాయిని మెరుగుపరచడంతోపాటు, మత్స్యకారులకు చేపల సేకరణను సౌకర్యవంతం చేస్తున్నాయి.

ఉపాధిహామీ పథకం ద్వారా కందకాలు, ఫిష్ పాండ్స్ నిర్మాణం చేపట్టడం ద్వారా ప్రజలకు ఉపాధి లభిస్తుంది. ఈ పనుల విస్తరణతో నీటి సంరక్షణ, మత్స్య సంపద అభివృద్ధికి బాటలు వేయడంతోపాటు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతోంది. అధికారులు ఈ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భూగర్భజలాలు పెరిగాయి



అటవీప్రాంతంలో కందకాల నిర్మాణాలు, చెరువులలో చిన్న కుంటలను ప్రత్యేకంగా నిర్మించడంతో భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. మామడ మండలంలో ఇప్పటివరకు 7 చెరువులలో చేపల పెంపకం కోసం నిర్మాణాలు చేపడుతున్నాం. 25 గ్రామపంచాయితీల పరిధిలో కందకాల నిర్మాణ పనులు చేయిస్తున్నాం.

– శివాజీ, ఈజీఎస్ ఏపీఓ, మామడ

ముత్యాలమ్మ విగ్రహం ఊరేగింపు



శోభాయాత్రగా ఆలయానికి వెళ్తున్న గ్రామస్తులు

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామంలో శనివారం ఉదయం ముత్యాలమ్మ విగ్రహం ఊరేగింపు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మహాదేవుడి ఆలయం నుంచి ముత్యాలమ్మ ఆలయం వరకు శోభాయాత్ర సాగించగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో మహాయజ్ఞం, సోమవారం ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. దీనికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

340 కిలోల నల్లబెల్లం పట్టివేత.. ఇద్దరిపై కేసు

దస్తురాబాద్:గుడుంబా ముడి సరుకును తరలిస్తున్న వాహనాన్ని శనివారం రాత్రి మండలంలోని మున్యాల గ్రామ సమీపంలో పట్టుకున్నట్లు నిర్మల్ ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపారు. మంచిర్యాల జిల్లా జన్నారం నుంచి ఏపీ01వై 8519 నంబర్ కల్గిన బొలెరో వాహనంలో 340 కిలోల నల్లబెల్లం, 20 కిలోల పటికను దస్తురాబాద్ మండలంలోని రేవోజీపేట, ఎర్రగుంట, మున్యాల గ్రామాలకు తరలిస్తున్నారనే సమాచారంతో మున్యాలలో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బొలేరో వాహనం డ్రైవర్ బాధవత్ రమేశ్‌ను విచారించగా జన్నారం మండల కేంద్రానికి చెందిన ఎర్ర సంపత్ కిరాణ దుకాణం నుంచి ముడిసరుకు తీసుకొచ్చినట్లు పేర్కొన్నాడు. ఇరువురిపై కేసు నమోదు చేసి పట్టుకున్న వాహనాన్ని నిర్మల్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. ఎక్సైజ్ ఎస్సైలు వసంత్‌రావ్, అభిషేక్, సిబ్బంది గౌతమ్, రవీందర్, సాయన్న, రాజేందర్, కల్పన తదితరులు పాల్గొన్నారు.